క్లుప్తంగా

వైభవంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం



అనపర్తిలో కనకదుర్గమ్మకు జలాభిషేకం చేస్తున్న మహిళలు

పెదపూడి: అనపర్తిలోని పాత ఊరు బాపనమ్మ గుడి వంతెన సమీపంలోని కనక దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు నదీ జలాలతో అమ్మవారికి అభిషేకం జరిపారు.

శివమాల ధరించిన భక్తులు



ఊలపల్లిలో శివమాల ధరించిన భక్తులు

బిక్కవోలు: ఊలపల్లి గ్రామంలో గురువులు దారపరెడ్డి శ్రీనివాస్, రొంగల శ్రీనివాసరావు, నెక్కల హరిబాబు ఆధ్వర్యంలో 23 మంది భక్తులు శివమాల ధరించారు. ఈ నెల 26న తేదన మహాశివరాత్రిని పురస్కరించుకుని వెలంపేట రామాలయం వద్ద మంటపం ఏర్పాటు చేసుకుని ప్రతి రోజు పూజులు చేస్తున్నారు. శివమాల ధరించిన భక్తులను గెదెల వీరబాబు ఆధ్వర్యంలో రామతీర్థం యాత్రను తీసుకువెళ్లారు.

ఇరు వర్గాల ఫిర్యాదులపై అరెస్టులు

సీతానగరం: మండలంలోని మిర్తిపాడులో ఈ నెల 2న జరిగిన ఘర్షణలో ఇరు వర్గాల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి, ఇరు వర్గాలను నార్త్ జోన్ డీఎస్పీ శ్రీకాంత్ అరెస్టు చేయగా, కోర్టులో హాజరుపర్చమని, వారికి రిమాండ్ విధించగా సెంట్రల్ జైలుకు తరలించామని కోరుకొండ సీఐ సత్య కిషోర్ తెలిపారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మేడే దుర్గా ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కాళ్ల దుర్గా ప్రసాద్, కాళ్ల నాగేంద్ర, గురు శివదత్తను మిర్తిపాడులో మధ్యాహ్నం 2 గంటలకు డీఎస్పీ శ్రీకాంత్ అరెస్ట్ చేశారని తెలిపారు. అలాగే రాజన పైడియ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటనగరం, మిర్తిపాడుకు చెందిన గోసాల వాడపల్లి, చిన్నం సురేష్, చిన్నం జగదీష్, పెనుగుల చందు, ముళ్ల ప్రేమ్ కుమార్, కోడూరి వెంకట గిరి, విత్తనాల వీరయ్యను మంగళవారం రాత్రి 10 గంటలకు మిర్తిపాడులో అరెస్ట్ చేశామన్నారు. ఇరు వర్గాలను రాజమహేంద్రవరం కోర్టులో హాజరుపర్చగా, రిమాండ్ విధించింది.

తల్లీకుమార్తెల అదృశ్యం

రాజానగరం: మండలంలోని సంపత్ నగరానికి చెందిన మహిళ.. ఏడాది వయసున్న తన కుమార్తెతో బుధవారం అదృశ్యమైంది. దీనిపై ఆమె భర్త చెల్లూరి మణికంఠ బుధవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే గ్రామంలో పాల డెయిరీలో పని చేస్తున్న మణికంఠ ఉదయమే డెయిరీకి వెళ్లి, తిరిగి వచ్చే సరికి ఏడాది వయసున్న కూతురు నందిని, భార్య దుర్గాసూర్య (21) కనిపించలేదు. పరిసర ప్రాంతాలలోగాలించినా ప్రయోజనం లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై నారాయణమ్మ తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

సీతానగరం: శాంతిభద్రతలను విఘాతం కలిగించడం, నిబంధనలను అతిక్రమించి సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కోరుకొండ సీఐ సత్యకిషోర్ హెచ్చరించారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ మిర్తిపాడు సంఘటనపై సోషల్ మీడియాలో తప్పుడు పోస్టింగ్‌లు పెట్టినా, అలాగే రెచ్చగొట్టే విధంగా ప్రవర్తించినా నాన్ బెయిల్‌బుల్ కేసులు నమోదు చేసి, కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

సారా స్థావరాలపై దాడి



సింగంపల్లిలో బెల్లపు ఊటను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

రంగంపేట: స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని సింగంపల్లిలో బుధవారం సారా స్థావరాలపై దాడులు నిర్వహించినట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. గ్రామానికి చెందిన తుట్టా సత్యనారాయణను అరెస్టు చేసి, అతడి నుంచి ఐదు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. రెండు ప్లాస్టిక్ డ్రమ్ముల్లో సారా తయారీకి సిద్ధం చేసిన 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్టు తెలిపారు. సత్యనారాయణపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించామన్నారు. ఎవరైనా సారా తయారు చేసినా, విక్రయాలు నిర్వహించినా 14405కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

స్టార్ట్.. కెమెరా.. యాక్షన్..

- షూటింగ్‌కు అనువుగా రాజానగరం పరిసరాలు
- ఎన్నో సినిమాల చిత్రీకరణ
- ఇక్కడ షూటింగ్ చేస్తే సూపర్ హిట్టే..
- దోసకాయలపల్లికి ఎంతో ప్రత్యేకత
- నేడు సినిమా దినోత్సవం



దోసకాయలపల్లిలో సినిమాలను చిత్రీకరించిన మునసబు మార్ని సుబ్బారావు ఇల్లు

మధురపూడి: ప్రజలకు వినోదాన్ని అందించే ప్రధాన సాధనాలలో సినిమాలు ముందుంటాయి. వాటిలో నటించే హీరో, హీరోయిన్లకు ఉండే క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇక సినిమా షూటింగ్‌లు జరిగే వివిధ ప్రాంతాలకు కూడా ఎంతో గుర్తింపు ఉంటుంది. గోదావరి పరిసరాలు, సముద్రపు బీచ్‌లు, అడవులు ఇలా ప్రతి దానికీ ప్రత్యేకత ఉంటుంది. ఈ కోవలోకే మన రాజానగరం నియోజకవర్గంలోని పలు ప్రాంతాలు వస్తాయి. పలు సినిమాల చిత్రీకరణ ఈ ప్రాంతాల్లో జరిగింది.

షూటింగ్‌కు అనుకూలం

నియోజకవర్గ పరిధిలోని రాజానగరం మండలంలో ఉన్న ఉద్యానవనాలు, కోరుకొండలోని స్వయంభు శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయం, సీతానగరం మండలంలోని గోదావరి తీరం షూటింగ్‌లకు అనుకూలంగా ఉన్నాయి. ఇక్కడ చిత్రీకరించిన అనేక సినిమాలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. జిల్లాలో 1100 సినిమాల షూటింగ్ జరిగితే రాజానగరం నియోజకవర్గంలో 370 సినిమాలను చిత్రీకరించారు. ముఖ్యంగా కోరుకొండ మండలం దోసకాయలపల్లికి ఎంతో గుర్తింపు ఉంది. ఇక్కడ అనేక సినిమాలను చిత్రీకరించారు. గ్రామంలోని నాటి మునసబు మార్ని సుబ్బారావు భవనం షూటింగులకు అనువుగా ఉండేది. ఇక్కడ చిత్రీకరించిన ఎన్నో సినిమాలకు మంచి కలెక్షన్లు వచ్చాయి. దర్శకులకు పేరు, ప్రఖ్యాతలు, హీరోలకు మంచి భవిష్యత్తును అందించింది. నిర్మాతలకు లాభాలను తెచ్చిపెట్టింది.

అవార్డులు


రాజమహేంద్రవరానికి చెందిన ప్రముఖ దర్శకులు ఆదుర్తి సుబ్బారావు అవుట్ డోర్ సినిమాలకు రూపకర్త. గోదావరి పరివాహక ప్రాంతాల అందాలతో పాటు, ఉద్యానవనాలను సినిమాల ద్వారా ప్రపంచానికి చూపించారు. ఆయన తీసిన మేఘసందేశం సినిమా 9 అవార్డులను సొంతం చేసుకుంది. అక్కినేని నాగేశ్వరరావు నటన ప్రేక్షకుల మన్ననలు పొందింది.

హిట్ కొట్టిన సినిమాలు

దోసకాయలపల్లి, నిడిగట్ల, మధురపూడి, తొర్రేడు, మిర్తిపాడు, విమానాశ్రయం పరిసర ప్రాంతాల్లో పలు సినిమాలను చిత్రీకరించారు. 1970లో బుద్ధిమంతుడు, 1973లో శారద సినిమాతో పాటు 80వ దశకంలో అక్కినేని నాగేశ్వరరావు నటించిన మేఘసందేశం, శోభన్ బాబు నటించిన దేవత, మనవూరి పాండవులు, భైరవ దీపం, మాధవయ్యగారి మనవడు, కె.విశ్వనాథ్ దర్శకత్వంలోని సూత్రదారులు సినిమాలను ఇక్కడే చిత్రీకరించారు.

నాటి హీరోలు – నేటి సూపర్ స్టార్లు

దోసకాయలపల్లిలో షూటింగ్ జరుపుకొన్న సినిమాలలో నటించిన హీరోలు నేడు సూపర్ స్టార్లుగా వెలుగుతున్నారు. మునసబు మార్ని సుబ్బారావు ఇంట్లో తీసిన సినిమాలకు మంచి గుర్తింపు వచ్చింది. మన ఊరి పాండవులు సినిమాతో ఆరంగేట్రం చేసిన చిరంజీవి ప్రస్తుతం మెగాస్టార్‌గా నిలిచారు. ఆయన కుటుంబ సభ్యులు సైతం స్టార్ హీరోలుగా కొనసాగుతున్నారు. రెబల్ స్టార్ కృష్ణంరాజు సినిమాలు అనేకం ఇక్కడ చిత్రీకరించినవే. వాటిలో ఎక్కువ సినిమాలు హిట్ అయ్యాయి.



కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం



మధురపూడి విమానాశ్రయం సమీపంలోని తోటలు



దోసకాయలపల్లి మునసబు ఇంట్లో చిత్రీకరించిన బెండు అప్పారావు సినిమాలోని ఓ సన్నివేశం

ఆదుర్తి విగ్రహం ఏర్పాటు చేయాలి



గోదావరి అందాలతో పాటు, జిల్లాలోని పలు సుందర ప్రదేశాలను సినిమాల ద్వారా ప్రపంచానికి తెలియజేసిన ప్రఖ్యాత దర్శకుడు ఆదుర్తి సుబ్బారావు శతజయంతి నిర్వహించకపోవడం శోచనీయం. ఎందరికో సినిమాల్లో అవకాశాలు కల్పించిన ఆదుర్తి విగ్రహాన్ని రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేయాలి. సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు విగ్రహాన్ని కూడా నెలకొల్పాలి.

– అడబాల మరిడయ్య, సినీ విశ్లేషకుడు, రాజమహేంద్రవరం

షూటింగ్‌లతో సందడి



మా తాత గారైన మునసబు మార్ని సుబ్బారావు మా ఇంటిని సినీ స్టుడియోగా చేశారు. అప్పట్లో అనేక సినిమాల షూటింగులు ఇక్కడే జరిగేవి. వచ్చిన వారందరికీ భోజన సదుపాయాలు కల్పించడం ఆయన ప్రత్యేకత. ఆనాడు మాకు 600 ఎకరాల విస్తీర్ణంలో భూములుండేవి.

– మార్ని సుధాకర్, దోసకాయలపల్లి

అవార్డులిచ్చిన ప్రాంతం

సినిమాకు మంచి లాభాలతో పాటు, అవార్డులు చాలా కీలకం. కోరుకొండ లక్ష్మీనరసింహస్వామి కొండపైన చిత్రీకరించిన ఆనంద భైరవి సినిమా సూపర్ డూపర్ హిట్ అయ్యి, రికార్డులు నెలకొల్పింది. అనేక అవార్డులను కూడా సొంతం చేసుకుంది. కోరుకొండ పరిసర ప్రాంతాల్లో చేసిన ఏవండీ ఆవిడ వచ్చింది, శారద, సీతారత్నం గారి అబ్బాయి, సిరిసిరి మువ్వ విజయవంతమయ్యాయి. దోసకాయలపల్లిలో ఏఎన్ఆర్ హీరోగా నటించిన మేఘసందేశం 9 అవార్డులను సాధించింది. అలాగే బెండు అప్పారావు ఆర్ఎంపీ సినిమాకు కాసులు పంట పండింది.

వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుల నియామకం

రాజానగరం: వైఎస్సార్ సీపీ పార్టీ అధ్యక్షుడు జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు రాజానగరం నియోజకవర్గంలో పార్టీ అనుబంధ విభాగాలకు అధ్యక్షులను నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ మేరకు పదవులు పొందిన వారి వివరాలు ఇలా ఉన్నాయి. యువజన విభాగానికి కొండమీద శ్రీను, మహిళా విభాగానికి చీర్ల ఉమాదేవి, రైతు విభాగానికి మదునూరి రామకృష్ణ, బీసీ సెల్‌కు అంకం దొరబాబు, ఎస్సీ సెల్‌కు గొంతు లక్ష్మణరావు, ఎస్టీ సెల్‌కు దాసరి ఏసు, మైనార్టీ సెల్‌కు షేక్ కళా బాషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు బత్తిన సత్తిబాబు నియమితులయ్యారు.

- విద్యార్థి విభాగానికి ప్రగడ కల్యాణ్, పంచాయతీరాజ్‌కు వేముల తాతారావు, ఆర్టీఐ విభాగానికి చినతిపల్లి శ్రీనివాస్, వలంటీర్స్ విభాగానికి మేడిశెట్టి స్వాతి, గ్రీవెన్స్‌కు వాద్రేవు శ్రీను, వాణిజ్య విభాగానికి నాళం రోశయ్య, వీవర్స్ వింగ్‌కు జానా శ్రీనివాస్, వైఎస్సార్‌టీయూసీకి కొనుబోజు సూర్యచంద్ర, లీగల్ సెల్‌కు దేవగుప్తపు ఉమాకాంత్, కల్చరల్ వింగ్‌కు శిరకనన అప్పారావు, సోషల్ మీడియా వింగ్‌కు మాకిరెడ్డి దివ్యసాయి కల్యాణ్‌బాబు, ఐటీ వింగ్‌కు అడబాల జగదీష్, దివ్యాంగుల విభాగానికి సుధా లక్ష్మణ్, పబ్లిసిటీ విభాగానికి ఇండుగుమల్లి సత్యనారాయణ, ఇంటిలెక్యువల్ ఫోరానికి దాట్ల రఘు, బూత్ కమిటీలకు నాగవరపు భానుశంకర్‌ను నియమించారు.

అనపర్తి నియోజకవర్గంలో..

పెదపూడి: అనపర్తి నియోజకవర్గంలో 27 మందిని అనుబంధ విభాగాలకు అధ్యక్షులుగా నియమించారు. యూత్ వింగ్ అధ్యక్షుడిగా పడాల దుర్గారెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాలిగా ఇమ్మంది విజయకుమారి, రైతు విభాగానికి నలమాటి సుబ్బారావు, బీసీసెల్‌కు కొండేటి భీమేశ్వరస్వామి, ఎస్సీసెల్‌కు సాంబత్తుల వీర వెంకటరమణ, ఎస్టీ సెల్‌కు గడ అర్జున్, మైనార్టీ సెల్‌కు సయ్యద్ ఫరీద్ బాషా, క్రిస్టియన్ మైనార్టీ సెల్‌కు ఆరుగుళ్ల నాగేశ్వరరావు, స్టూడెంట్ వింగ్‌కు బొడ్డు నానిబాబు, పంచాయతీ రాజ్ వింగ్‌కు సబ్బెళ్ల మోహన్ మురళీ వెంకట శివప్రసాద్ రెడ్డి, మున్సిపల్ వింగ్‌కు మండా వెంకటరెడ్డి, ఆర్టీఐ వింగ్‌కు అధ్యక్షుడు కిమరపు శ్యాంబాబు నియమితులయ్యారు.

- వలంటీర్ల వింగ్ అధ్యక్షుడి ఈ.మహేష్, గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడి పడాల దుర్గారెడ్డి, వాణిజ్య విభాగానికి కర్రి వీర వెంకట సత్యనారాయణరెడ్డి, వీవర్స్ వింగ్‌కు పప్పు సింహాచలం, వైఎస్సార్‌టీయూసీకి సలాది వెంకన్న బాబు, అంగన్‌వాడీ వింగ్‌కు పి.స్వర్ణలత, లీగల్ సెల్‌కు వెలగల లక్ష్మీనారాయణరెడ్డి, కల్చరల్ వింగ్‌కు కొల్లాం వెంకటరమణ, సోషల్ మీడియా వింగ్‌కు సత్తి రామారెడ్డిని నియమించారు.
- ఐటీ వింగ్ అధ్యక్షుడి ఎలుగుబంటి సుగుణా నందరాజు, దివ్యాంగుల విభాగానికి కొవ్వూరి ఆదిరెడ్డి, డాక్టర్స్ వింగ్‌కు ముంగి గంగరాజు, పబ్లిసిటి వింగ్‌కు కర్రి శ్రీను, ఇంటెలెక్చువల్స్ ఫోరమ్ అధ్యక్షుడి రొంగల అప్పాజీ, బూత్ కమిటీల అధ్యక్షుడిగా సబ్బెళ్ల కృష్ణారెడ్డి నియమితులయ్యారు. వీరందరికీ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

సూర్యదేవుని కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు



కల్యాణోత్సవ ఏర్పాట్లపై ఎస్సై రామారావుతో మాట్లాడుతున్న ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్

పెదపూడి: జి.మామిడాడ గ్రామంలో ఈ నెల 8న జరిగే సూర్యనారాయణమూర్తి కల్యాణోత్సవం సందర్భంగా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నామని కాకినాడ సబ్ డివిజన్ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మనీష్ అన్నారు. ఆ గ్రామంలోని సూర్యనారాయణమూర్తి ఆలయం, పరిసర రహదారులు, కల్యాణ ఏర్పాట్లను బుధవారం ఆయన పర్యవేక్షించారు. కల్యాణం, రథోత్సవంపై ఉత్సవ కమిటీ, పోలీసు అధికారులతో సమీక్షించారు. అనంతరం మాట్లాడుతూ కాకినాడ నుంచి అనపర్తి, బిక్కవోలు, రాయవరం, రాజమహేంద్రవరం వైపునకు వెళ్లే వాహనాలు పెద్దాడ నుంచి గంగ్రేడు సెంటర్ మీదుగా మళ్లించారన్నారు. ఆయన వెంట ఎస్సై కె.రామారావు, ఏఎస్సై శ్రీనివాసు, సిబ్బంది ఉన్నారు.

మద్యం షాపుల దరఖాస్తులకు గడువు పొడిగింపు

రంగంపేట: గీత కార్మిక కులాలకు చెందిన వారికి ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకోవడానికి గడువును ఈ నెల 8వ తేదీ వరకు పొడిగించినట్టు రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ సుధ తెలిపారు. ఆమె బుధవారం మాట్లాడుతూ రంగంపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అనపర్తి, బిక్కవోలు, రంగంపేట మండలాలు ఉన్నాయన్నారు. మండలానికి ఒకటి చొప్పున మొత్తం మూడు మద్యం షాపు ఏర్పాటుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. రంగంపేట, బిక్కవోలు మండలాలకు శెట్టిబలిజ, అనపర్తికి గౌడ సామాజిక వర్గాలకు చెందిన వారు అర్హులన్నారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లో లేదా, రంగంపేట ఎక్సైజ్ స్టేషన్‌లో స్వయంగా గానీ అందించవచ్చన్నారు.

అలరించిన గిరిజన మహోత్సవాలు





ప్రదర్శనలు నిర్వహిస్తున్న గిరిజనులు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలోని ఎన్టీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టీఎస్ఎఫ్) జాతీయ కమిటీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించే గిరిజన సంస్కృతి మహోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన గిరిజన కళాకారులు తమ సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఇచ్చిన ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా ఆకట్టుకున్నాయి. గిరిజన మహిళల గ్రూప్ డ్యాన్స్, కొమ్ము నృత్యం, తలపై ధరించిన బిందెలతో చేసిన నాట్యాలు అందరినీ అబ్బుర పరిచాయి. సంప్రదాయ సంగీత, సాహిత్యాలకు అనుగుణంగా డ్యాన్సులతో మైమరపించారు. విద్యార్థులు విజిల్స్ వేస్తూ, కేరింతలు కొడితే, వేదికపై ఆశీనులైన ముఖ్యఅతిథులు వీసీ ఆచార్య శ్రీనివాసరావు, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి డ్యాన్స్ చేశారు.



ప్రధాన ద్వారం నుంచి ఊరేగింపుగా వస్తున్న ఆదివాసీలు



గిరిజన కళాకారులతో కలిసి నృత్యం చేస్తున్న ముఖ్య అతిథులు

నిర్దిష్ట సమయంలో భూసర్వే పూర్తి చేయాలి



మిర్తిపాడులో భూ రీసర్వేను పరిశీలించి, సూచనలు ఇస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సీతానగరం/మధురపూడి: భూమి సరిహద్దులు కచ్చితంగా గుర్తించాలని, నిర్దిష్ట సమయంలో భూ రీసర్వే పూర్తి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి సూచించారు. సీతానగరం మండలం మిర్తిపాడు, కోరుకొండ మండలం కోటి గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వేను జిల్లా సర్వే అధికారి బి.లక్ష్మీనారాయణతో కలిసి బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మిర్తిపాడులో కలెక్టర్ మాట్లాడుతూ గ్రౌండ్ ట్రూటింగ్ సర్వే కచ్చితత్వాన్ని ధ్రువీకరించడానికి క్షేత్రస్థాయి భూమిపై డేటాను సేకరించే ప్రక్రియ అన్నారు. క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించే సర్వే బృందం జవాబుదారీతనంతో ఉండాలన్నారు. రైతు వారీగా సరిహద్దులు తప్పని సరిగా గుర్తించి, మార్కింగ్ ఇవ్వాలన్నారు. ఇప్పటికే రీసర్వే కోసం కార్యాచరణ సమయపాలనపై మార్గదర్శకాలు జారీ చేశామని, ఆ మేరకు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించాలని ఆదేశించారు. కోటి గ్రామంలో రీసర్వే పనుల పురోగతి, రికార్డుల నిర్వహణపై సమీక్షించారు. రీసర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ఇందుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను, మార్గదర్శకాల మేరకు సమయపాలన పాటించాలని ఆదేశించారు. ఆమె వెంట సీతానగరం తహసీల్దార్ ఎ.శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

కళలు, కళాకారులను బతికించుకోవాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న గజల్ శ్రీనివాస్

ప్రకాశం నగర్: మన సంస్కృతీ సంప్రదాయాలు పది కాలాల పాటు కొనసాగాలంటే మన కళలను, కళాకారులను గౌరవించుకోవాలని మాస్ట్రో డాక్టర్ గజల్ శ్రీనివాస్ అన్నారు. ప్రకాశం నగరంలోని ధర్మంచర కమ్యునిటీ హాల్లో బుధవారం గోదావరి ఉత్సవ్ కార్యక్రమం నిర్వహించారు. ఫిలాంత్రోఫిక్ సొసైటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అంతర్జాతీయ శ్రీ శ్రీ కళావేదిక సీఈవో కత్తిమండ ప్రతాప్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన గజల్ శ్రీనివాస్ మాట్లాడుతూ కళలకు కాణాచి, చరిత్రాత్మక రాజమహేంద్రవరంలో ఇలాంటి కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమన్నారు. నిర్వాహకుడు అద్దంకి రాజాయోనాను ఆయన అభినందించారు. గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి మాట్లాడుతూ అంతరించి పోతున్న మన కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలు, ప్రభుత్వాలపై ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు నర్సిపల్లి హారిక మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో మన కళలకు ఎంతో పేరు ఉందన్నారు. శ్రీశ్రీ కళావేదిక వ్యవస్థాపకుడు కత్తిమండ ప్రతాప్ మాట్లాడుతూ చారిత్రాత్మక రాజమహేంద్రవరాన్ని ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక రాజధానిగా ప్రకటించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అనంతరం విభిన్న రంగాల్లో ప్రతిభావంతులకు తెలుగు తేజం పురస్కారాలు అందజేశారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి సమష్టి కృషి

- కష్టపడి పని చేసిన వారికి గుర్తింపు
- జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి వేణు



వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణును సత్కరిస్తున్న అనుబంధ విభాగాల జిల్లా అధ్యక్షులు

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి అంకితభావంతో పనిచేయాలని జిల్లా అనుబంధ విభాగ అధ్యక్షులకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ సూచించారు. రాజానగరం నియోజకవర్గానికి చెందిన జిల్లా బీసీ సెల్ విభాగం అధ్యక్షుడు కొండపల్లి దుర్గారావు, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు అడబాల చిన్నబాబు, సోషల్ మీడియా ఇన్‌చార్జి వల్లభశెట్టి వీర వెంకట సత్యనారాయణ తదితరులు బుధవారం బొమ్మూరులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో మాజీ మంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి పనిచేసిన వారికి పార్టీలో సరైన గుర్తింపు ఉంటుందన్నారు. పదవులు పొందిన ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలతో నిత్యం మమేకవుతూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపే లక్ష్యంగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీలు వాసంశెట్టి పెద్ద వెంకన్న, కర్రి నాగేశ్వరరావు, కోరుకొండ మండల కోకన్వీనర్ గణేశుల పోశారావు తదితరులు పాల్గొన్నారు.

కత్తితో పొడిచిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష

కడియం: కడియపులంకలో ఒక ఇంట్లో దొంగతనం చేసి పారిపోతూ అడ్డువచ్చిన వ్యక్తిని పొడిచిన కేసులో నేతల రాజేష్ వర్మ అలియాస్ రాజేష్‌కు ఏడాది జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి చావలి రమ్య తీర్పునిచ్చారు. 2020లో నేతల రాజేష్ కడియపులంక గ్రామంలో ఒక ఇంటిలో దొంగతనం చేశాడు. అక్కడి నుంచి పారిపోతూ అడ్డువచ్చిన వ్యక్తిని పొడిచాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అప్పటి ఎస్సై అమీనా బేగం కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిని అరెస్టు చేశారు. మూడో ఏజేఎఫ్‌సీఎం ప్రిన్సిపల్ జ్యువెనల్ జస్టిస్ బోర్డు కోర్టులో ప్రస్తుత ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కోర్టు హెడ్ కానిస్టేబుల్ రాజేంద్ర సకాలంలో కోర్టులో సాక్ష్యాలను ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ సీహెచ్ రాజశేఖర్ వాదనలు వినిపించారు. రాజేష్ వర్మపై నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పునిచ్చారు.

ప్రారంభమైన ప్రాక్టికల్స్

కంబాలచెరువు: ఇంటర్మీడియట్ పబ్లిక్ ప్రాక్టికల్స్‌లో భాగంగా శుక్రవారం జిల్లాలోని 12 కేంద్రాల్లో ఒకేషనల్ ప్రాక్టికల్స్ ప్రారంభమైనట్టు ఇంటర్ జిల్లా ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఎన్ఎస్‌వీఎల్ నరసింహం తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకూ ప్రథమ సంవత్సరం, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించారని ఆయన తెలిపారు.

చోరీ కేసులో ఒకరి అరెస్టు



నిందితుడు, రికవరీ చేసిన సొత్తుతో ఎస్సై నాగ దుర్గాప్రసాద్, సిబ్బంది

కడియం: చోరీ కేసులో ఒకరిని అరెస్టు చేసి, రెండు ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్, ప్రింటర్, మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు ఎస్సై నాగ దుర్గాప్రసాద్ తెలిపారు. వివరాల్లోకి వెళితే.. వెంకాయమ్మపేటలో హైవే పక్కన ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌లో షట్టర్‌ను గత నెల తొమ్మిదో తేదీన దొంగలు పగులకొట్టారు. దానిలోని ల్యాప్‌టాప్, కంప్యూటర్, కొంత నగదు చోరీ చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్సై నాగ దుర్గాప్రసాద్ కేసు నమోదు చేశారు. జిల్లా ఎస్పీ నరసింహ కిశోర్ ఆదేశాల మేరకు సౌత్‌జోన్ డీఎస్పీ భవ్య కిషోర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఎ.వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గాప్రసాద్ దర్యాప్తు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో మంగళవారం చోరీ చేసిన ముగ్గురిలో కృష్ణాజిల్లా చౌటుపల్లి గ్రామానికి చెందిన అల్లాడి నాగమణికంఠ ఈశ్వర్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి ల్యాప్‌టాప్, కంప్యూటర్, తణుకులో దొంగతనం చేసిన మోటార్ సైకిల్, కొత్తగూడెం పరిధిలో దొంగతనం చేసిన లాప్‌టాప్‌ను స్వాధీనం చేసుకున్నామన్నారు.